# ఎదగని పువ్వు

బజారు కిటికీ ప్రక్క కుర్చీలో కూర్చుంది రాజేశ్వరి. వీధిలోంచి వచ్చే సాయంత్రపు ఎర్రని ఎండ కిటికీలోంచి అస్పష్టంగా ఆమె మీద పడుతోంది. ప్రతి సాయంత్రమూ అక్కడే కూర్చొని బజారువంక చూడడం ఆమె కలవాటు. ఆ అలవాటువల్ల ఆమెకు కలిగే అనుభూతి, పొందే తృప్తి - ప్రత్యేకమైన విలువకలవి.

- రిక్షాలో ఒక నడివయస్సు గల అందమైన స్త్రీ ఒళ్లో పిల్లవాణ్ణి కూర్చోబెట్టుకొని, ఆ పిల్లవాడి నడుం చుట్టూ భద్రంగా చేతులు వేసి, అవ్యక్తమైన ఆనందాన్ని అనుభవిస్తోన్న విప్పారిన ముఖంతో - వెళుతోంది.

- తెల్లటి డ్రస్సులో వున్న ఒక నర్సు తామరకాడల్లాంటి సన్నటి చేతుల్తో విలాసంగా హేండిల్ పుచ్చుకొని, తారాజువ్వలాగ జనాన్ని తప్పించుకొంటూ సైకిల్ తొక్కుకుంటూ పోతోంది.

- పదునెనిమిదేళ్ళ యవ్వనవతి చిలక పచ్చ పట్టు చీర, మబ్బురంగు జార్జెట్ వాయిల్ జాకెట్టూ ధరించి, మెడలో మామిడి పిందెల నెక్‌లెస్ మనోజ్ఞంగా మెరుస్తో ఉండగా చంకలోవున్న ముద్దుబిడ్డ చుట్టూ ఒక చేయి వేసి, మరో చేత్తో రబ్బరు బొమ్మలు పట్టుకొని - నడుస్తో వెడుతోంది.

రెప్ప వాల్చకుండా అదేపనిగా బజార్లోని జనం కేసి చూస్తోంది రాజేశ్వరి. జీవికి చేతుల యొక్క అవసరం ఎంత గొప్పది? ఏ పనైనా

సులభంగా చేసేందుకు, నడిచేందుకు, సంజ్ఞలతో మాట్లాడేందుకు, అందానికీ... చేతులయొక్క యదార్థమైన విలువ అవి లేని వాళ్ళకుకాని అర్థం కాదు. రెండు చేతుల్లో, ఏ ఒక్క చేయి లేకపోయినా లాభంలేదు. వెంటనే తన ఎడమ చేయి కేసి చూచుకుంది రాజేశ్వరి.

ఆమెలోని దుఃఖం ఒక్కసారి కట్టలు త్రెంచుకొంది.

తనకు ఎడమ చేయి లేదు. తను కుంటిది. తన అందానికి యిదొక తీరని లోపం. లోకం దృష్టిలో గుడ్డివాళ్ళకూ, చెవిటివాళ్లకూ, కుంటివాళ్ళకూ - సరిసమానమైన మర్యాదేవుంది. తనూ వాళ్ళల్లో జమే. సంఘంలో తన గౌరవానికి, యిరుగు పొరుగువారిలో తన గొప్పతనానికి! సాటివారిలో తన మేటి సౌందర్యానికి - ఎంత న్యూనత ? ఇదివరకటి 'తన'కూ - ఇప్పటి 'తన'కూ ఎంత తారతమ్యం ? ఈ తారతమ్యం లోకమూ, బంధువులూ, స్నేహితులూ - అందరి దృష్టిలో! ఈ ఒక్క చేయి విరగడంచేతనే తను భౌతికంగా ఇంత క్రిందికి దిగజారింది. తను అందరి స్త్రీలకు మల్లే చక్కగా అలంకరించుకొని, బంగారు బొమ్మలాగ తయారై - గాలిలో చేతులు ఆడించుకొంటో, పేరంటానికి పోవడానికి వీల్లేదు. తనకు ఒక చేయిలేదు! కారు మీద, రైలుమీద ఉత్సాహంగా ప్రయాణం చేయటానికి వీలు లేదు. అందరూ తనవంకే ఏదో వింతగా, జాలిగా, హేళనగా, పరీక్షగా చూస్తారు. కొంతమంది తన విధికి సానుభూతి చూపుతున్నట్లు చూస్తారు. ఈ జన్మలో తనకు పట్టిన యీ మాసిపోని దురదృష్టానికి తను క్రిందటి జన్మలో ఏం పాపం చేసుకుందో!

బజార్లో టాక్సీ హారన్!

రాజేశ్వరి అటు చూచింది. సన్నని మోతతో, సున్నితంగా, దుమ్ము లేపుకుంటో పోయింది టాక్సీ. టాక్సీని చూడగానే ఆమె మెదడులోని స్మృతులు రెక్కలు విప్పుకున్నాయి.

మూడు మాసాల క్రితం ఒక రోజు సాయంత్రం జరిగిన సంఘటన .

సిల్కు ఎంపోరియంనుంచి బయటికొచ్చారు తనూ, తన భర్తా! ఆయనగారు ముందు నడుస్తున్నారు. బస్టాపు రోడ్డుకు ఆవతలి భాగం.

అక్కడికి వెళ్ళేందుకు రోడ్డు దాటాలి. అది మెయిన్ రోడ్డు. బస్సులూ, టాక్సీలూ, జట్కాలూ, రిక్షాలూ, సైకిళ్ళూ, మనుష్యులూ - సాయంత్రపు చివరి భాగం కావటంచేత సందడి జాస్తిగా వుంది. రోడ్డు దాటటం ఎందుకు - జట్కాలో యింటికి వెళదాం అన్నారు ఆయన! కాని తనే వద్దన్నది జట్కా అయితే ఎక్కువడబ్బు ఖర్చని. కాని జట్కాలో ఆరోజు వెళ్లితే ఆ సంఘటన జరిగి ఉండేది కాదు .. తన బ్రతుకు యింత నవ్వులపాలయ్యేది కాదు ... కాని అట్లా ఎందుకు జరుగుతుంది? తను అర్ధ రూపాయి ఆదా చూసింది! స్త్రీకి యిలాంటి విశాలతలేని బుద్ధి వుండబట్టే - సమాజంలో ఒక్కొక్కప్పుడు అల్పంగా చూడబడుతూంది! మగవాడు ఎంత విరివిగా ఖర్చు పెట్టుకుంటున్నా, బజారులో ఎంత సుఖాన్ని కొనుక్కొంటున్నా - కొంతమంది స్త్రీలకు ఆలోచన ఉండదు; తాము గీచి గీచి అణాకాసు వెనుక వేసినందుకు తృప్తిపడుతారు. తనూ ఆటువంటి ఆలోచనతోనే సిటీబస్సుమీద యింటికి వెళ్ళేందుకు దారి తీసింది. ఆయనగారు ముందుగా రోడ్డు దాటారు. తనూ - ఆయన వెనుకనే - చూసుకుంటూ రోడ్డు దాటుతోంది. చేతిలో బెంగుళూరు సిల్కు-చీరె ప్యాకెట్టు, కాళ్ళకు కాన్వాసు స్లిప్పర్సు - అక్కడికీ వడిగానే దాటాలని ప్రయత్నించింది. ముందునుంచీ ఒక లారీ మోతపెట్టుకుంటూ శక్తిలాగా వస్తోంది. అడుగు ముందుకు వేస్తే దానిక్రింద పడవచ్చునన్న ఉద్దేశంతో అలాగే రోడ్డుమధ్య నిలబడింది. వెనుకగా, దగ్గరగా వేగంగా టాక్సీ హారన్! ముందుకు అడుగువేస్తే లారీ, వెనుకకు అడుగువేస్తే టాక్సీ.

...కళ్లు గట్టిగా మూసుకొని అలాగే నిలబడింది. టాక్సీ హారన్, మోత ... అంతే ఆ పైన తనకేం తెలీదు! తనకు తెలివి వచ్చేటప్పటికి హాస్పిటల్‌లో వుంది. శరీరమంతా కట్టులతో, ఊపిరి పీల్చుకొనేందుకు కూడా వీలులేని నిర్బంధం మధ్య పడుకొని ఉంది. దెబ్బలు బాగా తగిలాయి. ఎడమచేయి తీసి వేయవలసి వచ్చింది. ఒక చేయి మనిషిగా రెండు మాసాలకు యింటికి వచ్చింది.... ఇంకా తను 'అదృష్టవంతురాలు' అని అంటారు కొంతమంది. చావుతప్పి చేయి విరిగినందుకు సంతోషించమన్నారు. అందులో కుడిచేయి విరగకుండా ఎడమచేయి విరిగినందుకు కూడా సంతృప్తి పడమన్నారు...తన బాధ వీళ్ళకేం అర్థమవుతుంది?

ఆ దెబ్బలతో చచ్చినా బాగుండేది! బ్రతికినన్నాళ్లూ, ఇట్లా అంగవైకల్యంతో, అవజ్ఞతో, న్యూనతతో, దించుకుపోయిన అభిమానంతో, నీడ లాంటి నిరాశతో బ్రతికే కంటె, — చస్తే నయం కాదూ! కాని భగవంతుడు తనలోని సహనాన్నీ, ఓర్పునూ పరీక్షించ దలిచాడు. ఈ స్త్రీ ఎంత తక్కువదనాన్నైనా సహించగలుగుతుంది' అని లోకానికి తెలిసేటట్టు చేయాలనుకున్నాడు. తనకు చావు రాలేదు. చావును రప్పించలేని దేవుడు — చేయిని ఎందుకు విరగగొట్టాలి? ఇంతికంటే వేరే విధంగా తనమీద పగతీర్చుకో దల్చలేదా? దేశంలో నిత్యమూ కార్లక్రింద ఎంత మంది పడటం లేదు? వాళ్లకందరికీ చేతులే విరుగుతున్నాయా?

బజారులోని జనంకేసి చూస్తోంది.

పేవ్ మెంట్ మీద యీలగిలబడి, ప్రాణం కడబట్టి, బరువుగా యీడ్చుకుంటూ నడిచే బిచ్చగాడు — కిటికీలోంచి అందమైన ముఖాన్ని చూసి ఆగాడు. ఆ అందమైన ముఖాన్ని చూడగానే బిచ్చగాడి ముఖం పంచదార లడ్డు వంక చూసిన పసిపిల్లాడి ముఖంలాగ అయింది. ఆ బిచ్చగాడికి ఒక కాలు లేదు. కొయ్యకాలి ఆధారంతో వాడు నడుస్తాడు. చెదిరిన పిచ్చుక గూడులాగుంది వాడి తల; బాగా నల్లగా కాలిన యిటుక రాయిలాగ వుంది వాడి శరీరం. బజారులోని దుమ్మంతా వాడి ముఖం మీదా, చినిగిన గుడ్డలమీదా వుంది. వాణ్ణి చూడగానే రాజేశ్వరి అరచేతులతో ముఖం దాచుకొంది.

"అమ్మా! కుంటివాణ్ణి ..ధర్మంచేయి తల్లీ!"

రాజేశ్వరికి ఎందుకో వళ్లంతా కెలికినట్లయింది. కిటికీ తలుపులు దభేలుమని వేసింది. మానవహృదయం ఎంత విచిత్రం? ఒక్కొక్కప్పుడు సాటి వాడు తనలాగ సౌఖ్యం పొందుతూంటే అసూయ పడుతుంది; తన లాగే బాధ పడుతూంటే ఆనందపడుతుంటుంది; కాని రాజేశ్వరి హృదయం తనలాగే అంగవైకల్యం గల మనిషిని చూడగానే అవమానంతో కృంగిపోయింది. నత్తివాడిని నత్తివాడు పలకరిస్తే వచ్చే కోపం లాంటిదే కలిగే అవమానం లాంటిదే — ఆ మెలో కూడా కలిగింది.

అయిదు నిమిషాల అనంతరం కాస్త ఆ భావననుంచి తేరుకొని - మళ్ళీ బజారు కిటికీ తలుపు తెరిచింది. బజారు సందడి తాలూకు సుడి గాలి లోపల కొచ్చింది.

"ఇంకా టాయిలెట్ పూర్తికాలేదూ!"

"అయింది"

"మరి రావేం ?"

"అబ్బా! ఉండండి. ఇంకా ఆరు గంటలైనా కాలేదు అంత త్వర పడతారేం ?"

"మరి సినిమా అందొద్దూ ?"

"అందుతుంది లెండి"

"సరి - అయితే! నీ యిష్టం వచ్చినంతసేపు అలంకరించుకో. అదుగో - ఆ చెక్కిలి పైన స్నో మీద నలక పడ్డట్టుంది. ఆ నలకే చంద్రునిలోని మచ్చలరీతిగా నీ వదన సౌందర్యానికి కించిత్ అంతరాయం కలిగించవచ్చు."

"అబ్బ పొండి - మీరున్నూ, మీ వేళాకోళాలూ..."

కుండ బ్రద్దలు కొట్టినట్టు ఒక్కసారి నవ్వులు.

ఇంటి ప్రక్క భాగంలోంచి వినవచ్చాయి. రాజేశ్వరి ముఖం చిట్లించుకొంది. ఆమె ముఖంలో హఠాత్తుగా నల్లనెత్తురు గూడు కట్టుకుంది. ఆమె అట్లా చూస్తూండగానే — రెండు నిమిషాల అనంతరం ఆదర్శ దంపతు లిద్దరూ చేతులు చేతులూ కలుపుకొని, రతీ మన్మథుల్లాగ, పార్వతీ పరమేశ్వరుల్లాగ, చిలుకా గోరువంకల్లాగ రోడ్డుమీద ఆ కిటికీ ముందుగానే సాగిపోయారు. ఆ దృశ్యాన్ని చూసిన రాజేశ్వరి కళ్లు చమ్మగిల్లాయి. అంతేగాని కన్నీళ్లు రాలేదు.

తనూ, తన భర్తా అట్లా కలిసి ఆహ్లాదంగా సినిమాకు వెళ్ళిన సాయంత్రాలు చాలా ఉన్నాయి. కాని తను సినిమాచూసి ఎన్ని రోజులైంది ? మూడు మాసాలు! ఇంకా ఎక్కువేనేమో! ఆయనగారు తనను సినిమాకు

తీసుక వెళతా ననటం లేదే! ఎందు కంటారు? ఒకచేయి లేని కుంటి భార్యను ప్రక్కన పెట్టుకొని అంతమంది నవనాగరికుల్లో కూర్చొని సినిమా చూడడం నామర్దా కదూ! కాని ఆయనగారు అట్లా భావించేవారు కాదు.

ఆ దంపతులు ఎంత అన్యోన్యంగా వుంటున్నారు? ఈ ఇంటిలోచేరి యింకా రెండు రోజులైనా కాలేదు! అప్పుడే బీచికి షికార్లూ, రాత్రిళ్లు సినిమాలు, ఇంట్లో ఎప్పుడూ కబుర్లు చెప్పుకొంటూ, కిలకిల నవ్వుతూ, కాలక్షేపం జేస్తారు! ఆయనకు ఎక్కడ ఉద్యోగమో! ఏవేళప్పుడు వెళతాడో — మరి ఎప్పుడూ ఇల్లు కదిలినట్టుండదు. ఆమె చాలా బాగుంటుంది! తనకంటె కొంచెం ఎరుపు, తన కళ్ళకంటె ఆమె కళ్ళు కొంచెం పెద్దవి, తనకంటె ఆమె జడే కొంచెం పెద్దది — అయినా ఏది శాశ్వతం? తనూ ఒకప్పుడు ఈ పేటలోని ఆడవాళ్ళందరికంటే సౌందర్యవతే! స్త్రీ సౌందర్యం మీద ఎప్పుడైనా మాటవస్తే యీ పేటలోని వాళ్ళంతా తననే ముందుగా ఉదహరించేవారు. కాని ఇప్పుడు .. తన అందం ఏమైంది? ఏ పాపమూ చేసియుండని తనకే, ఏ క్షణమూ ఎవరికీ ద్రోహం చేసి యుండని తనకే. జీవితాన్ని గురించి మధురమైన కలలు కనే తనకే— భగవంతుడు యిట్లా రాశాడు. మనుష్యుల్లో, ఈ క్షణం మెరిసే అందం, మెదిలే భావాలు, మమతలు, మదిలోఆలోచనలు, — ఏవి నిత్యం? పీటల మీద వున్న పెండ్లి కుమారుణ్ణి చూసి ఆనందంతో ఉప్పొంగే పెండ్లి కుమార్తె హృదయంలో ముల్లు గుచ్చుకునే సంఘటన క్షణాలమీద ఎందుకు సంభవించకూడదు? కొన్ని సంవత్సరాల అనంతరం విదేశాల్లో తిరిగినాక భార్యనూ పిల్లలనూ తలచుకొని ఆరాటంతో కూడుకొన్న సంతోషాన్ని పొందే యువకుడు హఠాత్తుగా ఓడ సముద్రంలో మునిగి ఎందుకు మరణించకూడదు? గంటల తరబడి వేచియున్న తరువాతకూడా ప్రియురాలు సాంకేతికస్థలానికి రాకపోతే — ఆ ప్రియురాలికి ఏదో వివరించరాని విపత్తు సంభవించిందని ఆ ప్రియుడు ఎందుకు అభిప్రాయపడకూడదు స్త్రీ అందం అనిత్యమైంది. మగవాడి సమక్షంలో ఆ అందం మరింతశోభగా రాణించనూ వచ్చు, రాణించకపోనూ వచ్చు, అసలు రూపే మారవచ్చు. రాణించే అందమైనా ఏం శాశ్వతం? తనగతి ఏమైంది? విధి పగచే చూపించే చేష్టలకు లొంగక మానవమాత్రు లేంచేయగలరు?

వీధిలోని లైట్లన్నీ ఒక్కసారి వెలిగాయి.

గదిలోని లైటుకూడా వెలిగింది. రాజేశ్వరి తల్లి లైట్ వేసి — వంట యింట్లోకి వెళ్ళింది.

రాజేశ్వరి బజారువంకే చూస్తోంది. ఆమె చూపుల పరిధిలో భర్త అగుపించాడు. అప్పుడే గాంధివిగ్రహం మలుపు తిరిగాడు. దృష్టి నిలిపి అటే చూస్తోంది ఆమె. కార్లూ, బళ్ళూ, సైకిళ్ళూ, మనుషులూ — ఆయన గారు సరిగ్గా యింటికి చేరుకుంటారో లేదో! ఛీ! వెధవ అనుమానం! ఇదేమిటి తన మనస్సు ఇవ్వాళ చెడు కోరుతోంది? చెడును దర్శించాలని తన కళ్లు ఉబలాట పడుతున్నాయి? ఆయనగారికి ఏ ఆపదా రాకూడదు. సురక్షితంగా యింటికి చేరుకోవాలి! కాని తను అనుకోవడంతోనే కాల పరిణామం సరిపోతుందా?

కాలం నడకే అంత! ఆనాడు సిల్కు ఎంపోరియం మెట్లమీదనుంచి తను ఎంత సంతోషంగా వుంది? మంచి సిల్కు చీరెలు దొరికాయని, అవి ధరించిన తన అందాన్ని చూసి ఆయనగారు ఎంతో మురిసిపోతారనీ, భర్తను సుఖపెట్టిన భార్య అవుతుందని — ఎంత గర్వపడ్డది? ఆ గర్వం, సంతోషం, ఉత్సాహం, హోదా, — రెండు నిమిషాల అనంతరం ఏమై నాయి. అంతే మనుషుల బ్రతుకులు! క్షణం ముందు ఏం జరుగుతుందో తెలియదు కదా! ఏ కారు క్రిందో పడవచ్చు, లేదా హఠాత్తుగా గుండె ఆగి చనిపోవచ్చు — కాకపోతే మామూలుగా ఉండొచ్చు. అంత నిత్యం లేని యీ మనుష్యులు — భవిష్యత్తుమీద నమ్మకాన్ని ఏర్పరచుకొనే తాహతులేని ఈ మనుష్యులు భౌతికమైన యీ అందం కోసం ప్రాకులాడ టమూ, గర్వపడటమూ మురిసిపోవటమూ, అహంకారాన్ని పెంపొందించు కోవటమూ, — ఎందుకు? దేశకాల పాత్రోచితమైన సౌందర్యాన్ని ఆరా ధించలేనివాళ్లూ, అభినందించలేనివాళ్ళూ, నీళ్ళపైన మెరుపుల్లాంటి తమ సౌందర్యానికి పొంగి పోతారు. తమ ఆత్మల లోతులోకి తామే చీకటి లాంటివంచనను ప్రవేశపెట్టుకుంటారు. ఇంత ప్రోత్సాహంగా, ఆనందంగా భర్తతో సినిమాకు వెళ్ళిన ఆమె రేపు ఉదయం అంతకంటె ఎక్కువగా బాధపడుతుందేమో! దుఃఖపడుతుందేమో! ఎవరు చూశారు భవిష్యత్తు

లోని వెలుగు నీడల్ని? ఎవరు నిర్ణయిస్తారు భవిష్యత్తులోని హెచ్చు తగ్గుల్ని?

ఆయనగారు యింకా రావడంలేదే! అదుగో! వస్తున్నారు... రోడ్డు దాటుతున్నారు. వెనకనుంచి లారీ వస్తున్నది అయ్యో! ముందు నుంచి...టాక్సీ ..చూశారో లేదో! అమ్మయ్య! వడిగా నడిచి యివతల వైపునకు వచ్చారు...గండం గడిచినట్లే! బ్రతుకులో ప్రతి క్షణమూ గండమే! ఆయనగారికి అంత శ్రమ ఎందుకు? తొందర! ఇంటికి రావాలని తొందర! భార్యను చూడాలనే ఆసక్తి ఏర్పరచుకొన్న తొందర. సగం ఆ తొందరే మనుష్యుల్ని యీ స్థితికి తెచ్చేది.....

ఆయనగారు ఇంట్లోకి వచ్చిన చప్పుడు –

రాజేశ్వరి కిటికీలోంచి ముఖాన్ని ఇటు మరల్చింది. ద్వారం దగ్గరకు వచ్చింది – భర్తను ఆహ్వానించేందుకు. ముఖంలోని అలజడిని సాధ్యమైనంత వరకు పోగొట్టి పెదాల మొనల మీదికి చిరునవ్వును రప్పించింది. ఇట్లా తాత్కాలికంగా భర్తలను సంతోషపెట్టేందుకు భార్యలు తమ ముఖాల్లో కృత్రిమ వికాసాన్ని కల్గించటం కద్దు.

దయానిధి గదిలోకొచ్చాడు. సాయంత్రం వరకూ ఆఫీసులో చేసిన గాడిద చాకిరి తాలూకు శ్రమ అతని ముఖం మీద ఎక్కడా అగుపించదు. మాఘమాసపు మల్లె పువ్వు పరిశుభ్రంగా వున్నట్లే, – అతని ముఖం కూడా పరిశుభ్రంగా వుంటుంది. అతని చేతిలో చిన్న ప్యాకెట్ వుంది. రోజూ భార్యను తృప్తి పరచేందుకు భార్యచేత, 'అబ్బా!' ఇప్పుడవన్నీ ఎందుకండి!' అని అనిపించుకొనేందుకు, – ఏవో చిత్రాతి విచిత్రమైన వస్తువులు బజార్నుంచి తీసుకువస్తూవుంటాడు.

ఏమిటండీ ఆ ప్యాకెట్?" అన్నది రాజేశ్వరి కళ్ళల్లో తృప్తిని కనబరుస్తూ.

"చెప్పుకో చూదాం!" సాధారణమైన వాక్యం.

"ప్చ్" తల ఆడించింది రాజేశ్వరి తనవల్ల కాదన్నట్టు.

"ఓస్. ఇంతేనా?"

"అయితే! ఏవరీ బొమ్మలు –"

"బొమ్మలు దేనికి? నువ్వేమన్నా పసిపిల్లవా?"

"మరి, – రిబ్బను!"

"ప్చ"

"టాయిలెట్ ఆర్టికిల్!"

"ఇంటినిండా వున్నాయిగా!"

"మీరే చెప్పండి!"

"నే చెప్పటంలో గొప్పతనం ఏముంది? నువ్వే చెప్పాలి!"

"బాగానే ఉంది. మూసి వున్న గుప్పిట్లో ఏముందో ఎవరు మాత్రం ఎట్లా చెప్పగలరు?

"ఓడిపోయానని ఒప్పుకో!"

"ఒప్పుకున్నాను"

"అదుగో నీ కళ్ళు ఒప్పుకోవటం లేదు."

"కళ్లు ఒప్పుకున్నాయి"

"మరి పళ్లు కనబడేటట్టు ఒక చిరునవ్వు నవ్వు, అప్పుడు నాకు సక్రమంగా నమ్మకం చిక్కుతుంది"

అలాగే నవ్వింది రాజేశ్వరి.

ఆ ప్యాకెట్ విప్పటం ఆరంభించాడు. ఆ ప్యాకెట్‌లో యింకో ప్యాకెట్, అందులో ఇంకొకటి, ఆ యింకొకటిలో మరొకటీ, ఆ మరొకటిలో మరొకటీ, ఆ మరొకటిలో కూడా యింకొకటి – చూస్తున్నకొద్దీ ఆ చివరి ప్యాకెట్‌లో ఏమున్నదోననే ఆదుర్దా ఎక్కువైంది రాజేశ్వరిలో. తీరా ఆఖరి ప్యాకెట్ విప్పేసరికి ఆమెలో ఆశ్చర్యమే మిగిలింది! ఆ ప్యాకెట్‌లో ఏమీ లేదు.

అదే వింత, ఆశ్చర్యమూను.

ఇద్దరూ ఒక్కసారి ఫక్కుమని నవ్వుకున్నారు.

ఆ నవ్వును భరించలేక గదికూడా నవ్వింది ప్రతిగా.

వెన్నెల హృదయానికి ఎంత హాయిని ప్రసాదిస్తుంది? కాని వెన్నెలను ద్వేషించేవాళ్ళూ, చీకటిని కావులించుకునేవాళ్లూ వున్నారు. సాటి హృదయంలో మంచి చూడటానికి ఎంత హృదయ వైశాల్యం కావాలి? ఎంత ఆధ్యాత్మిక సంపద కావాలి? అట్లాగే సాటివారిలో సౌందర్యాధిక్యతను అంగీకరించటానికి ఎంత ఆత్మజ్ఞానం కావాలి? నెమిలి ఫించం అందంగా వుంటుంది; తెల్లని మేఘంవెనుక నీలం అందంగా ఉంటుంది. గులాబి పువ్వు రంగు అందంగా వుంటుంది; వెన్నెల కాంతికి మెరిసే నీళ్లు అందంగా వుంటాయి. – కాని ఈ ప్రకృతి సౌందర్యాన్ని గుర్తించే నిర్మల హృదయాలు ఎన్ని? మనస్సులోని రోగం మనిషిలోని మంచితనాన్ని హరించుతుంది. మనస్సులోని అసూయ ఎదుటి వ్యక్తిలోని చెడునే కాంక్షిస్తుంది.

ఒక చేయి లేకపోవడం – రాజేశ్వరిలో చాలా పెద్ద మార్పును తెచ్చింది. ఆ మార్పు భౌతికంగా ఎంత అగపడనప్పటికీ దాని తీవ్రత అంతటి ఆంతరంలో చాలా ఎక్కువగా వుంది. ఆమె హృదయాన్ని పూర్తిగా మార్చివేసింది.

రాజేశ్వరి తన చుట్టూ ఒక వింత వాతావరణాన్ని సృష్టించుకుంది. కాని విచారించవలసిందేమిటంటే – తాను సృజించుకొన్న ఆ వాతావరణానికే ఆమె అలవాటు పడలేదు. పై పెచ్చు ఆమెలో క్షణం క్షణం అలజడీ, అశాంతీ ఎక్కువ కాజొచ్చింది. తాను ఇంకొకరకు హేళన వస్తువుగా తయారైందని ఆమె ఎప్పటినుంచి అనుమానపడుతూ వస్తోందో– అప్పటినుంచీ ఆమెకు లోకపు సౌందర్యంమీద, ఆ సౌందర్యాత్మకమైన వస్తువులమీద 'జెలసీ' అభివృద్ధి అవుతూ రాసాగింది.

ఇంటి ప్రక్కభాగంలో ఉండే దంపతుల అన్యోన్య దాంపత్యం చూస్తూన్నకొలదీ రాజేశ్వరి గుండె ఎందుకో కోసుకుపోతున్నట్టుగా అవసాగింది. ప్రక్కభాగంలో ఎట్లా మాట్లాడుకున్నా, ఎంత మెల్లగా నవ్వు

విన్నా, వస్తువుల్ని ఎట్లా కదిలించినా — వినబడుతుంది. ఉదయాలు, మధ్యాహ్నాలు, సాయంత్రాలు, రాత్రిళ్లు ఆ దంపతులు — ఆనందంగా, ఖులాసాగా, వ్యంగ్యంగా, నవ్వుతూ, కోపంగా, వెకిలిగా, పోకిరీగా — మాట్లాడుకుంటూంటే, ఆమె గుండె క్రింద ఎందుకో ద్వేషం, అసూయ కోపం తలఎత్తుతూ వుంటుంది.

ఒక రోజు దయానిధి అన్నాడు.

"ఏం తోచకపోతే ప్రక్కభాగంలో వాళ్ళతో కాలక్షేపం చేయ రాదూ!"

పెదాలు విరిచింది రాజేశ్వరి.

"ఎందుకో ఆమె అంటే నాకు తలనొప్పి. ఆ వేషాలూ, వెకిలి నవ్వులూ, సకిలింపులు, వొయ్యారాలు, విలాసాలు నాకు గిట్టవు" అస హ్యంతో అన్నది.

ఒకప్పుడు నువ్వు అట్లానే వుండేదానివి!"

"అంత పోకిరీగానా?"

"పోకిరీ ఏముంది? యౌవనపు ఆరంభదశలో అందరూ అట్లానే వుంటారు. ఆమె భర్త మోహన్‌రావుగారు సహృదయుడు!"

"ఏమో! మీరు వాళ్లను ఆ భాగంలోకి తీసుకొచ్చివుండటం నాకు బాగుండలేదు."

"ఏం"

రాజేశ్వరి సమాధానం చెప్పకుండా విసురుగా విసుగ్గా మరో గదిలోకి వెళ్ళింది. ఎట్లా చెప్పటం? ఆమె ఈ పేటలో పెద్ద అందగత్తె నని విర్రవీగుతూ వుంటుంది. ఈ పేటలో ఎవ్వరూ ధరించని క్రొత్త ఫ్యాషన్ గల జాకెట్లు, నగలు ధరిస్తుంది. ఈ కాలపు నాగరికతకు తాను నాంది అన్నట్టు సంచరిస్తుంది. ఆమెలో కలెక్టరుగారి భార్య కుండవలసిన గర్వం వుంది. మంత్రిగారిభార్య కుండవలసిన హోదా వుంది. తమది ఆదర్శ

దాంపత్య మున్నట్టు చెప్పుకొంటుంది! ఆమె మాటలు, చేతలు ఎందుకో తనలో అశాంతిని రేకెత్తిస్తున్నాయి. తనలో ప్రస్తుతంగానీ, ఇక ముందు గానీ ఏదైనా మార్పు వస్తే - ఆమే ప్రత్యేక కారణం. తను ఎట్లాగైనా వీళ్ళను యీ యింటినుంచి వెళ్ళగొట్టించాలి. అందాక తనకు శాంతిలేదు. తనహృదయం యీ విధంగా బాధపడుతూండటం తను సహించలేదు. ఆమె ఆనందం, ఆమె చంచలం; ఆమె కులుకూ, ఆమె ఎరుపూ, ఆమె విరుపూ, ఆమె కళ్లూ, ఆమె పెదాలు - తనను హేళనచేస్తూ వుంటాయి. నిన్న సాయంకాలం కేవలం తనను చూసి నవ్వింది. ఆ నవ్వు క్రింద ఏదో ప్రత్యేకత ఉంది! తను కుంటిదని అపహాస్యమా? దేవుడు విధించిన శిక్షకు అపహాస్యమా? ఆమె సర్వకాల సర్వావస్థల్లోనూ యింత అందంగా వుంటుందా! అందం ఆమె జన్మ హక్కా?

ఆ మరునాడు ఉదయం ఇంటి ప్రక్కభాగంలో ఆమె నవ్వులు రాజేశ్వరికి వినిపించలేదు. ఆమెకు కారణం అగుపించలేదు. పది గంటలకు కాబోలు ఆమెకు ఆ పూట జ్వరం వచ్చినట్లు సంభాషణలవల్ల గ్రహించింది. రాజేశ్వరి నవ్వుకుంది. మనస్సులో అనుకుంది: ఏక్షణానికి ఏం వస్తుందో ఎవరు చెప్పగలరు? క్షణంలో సంతోషం - క్షణంలో దుఃఖం. సంతోషంలో వుండగానే గర్వం, అహంకారం, వొళ్లు విరుపూ! మనిషికి ఆ స్వభావం పనికిరాదు.

ఆమె భర్త మోహన్‌రావు ఆమెను రెండో రోజు ఉదయమే గవర్నమెంటు హాస్పటల్లో చేర్పించాడు. ఆమెకు మశూచికం వచ్చింది. ఆ విషయం రాజేశ్వరికి తెలిసింది. ఆమె హృదయంలో పూలవర్షం కురిసినట్లయింది. ఆ సాయంత్రమే దయానిధి సానుభూతిగా భార్యతో అన్నాడు.

"పాపం! మోహన్‌రావు భార్య కులాసాగా వుండేది? అటువంటి ఆమెకు భగవంతుడు ఘోరమైన అన్యాయం చేశాడు. మశూచికం ఆమెను ఏ రూపులోకి మారుస్తుందో"

"అవును. ఏమైనా చేతుల్లోని గీతలనూ, నొసటిమీద, రాతలనూ, ఎవరు తప్పించగలరు? ఆ విషయం తెలిసే మనం ఎన్నెన్నో అనుకుంటాం;

ఎంతో మిడిసి పడతాం. కాని ఫలితం అగపడుతుంది. బాధపడతాం. కమిలిపోతాం.'' అన్నది రాజేశ్వరి వేదాంతో క్తంగా.

ఆమె పాటల వెనుక దాగియున్న "ద్వేషం" దయానిధికి సంపూర్ణంగా అర్థంకాలేదు. ఈ మధ్య భార్యయొక్క మనస్తత్వం అతనికి చాలా నూతనంగా అగపడుతూంది. జీవితంలో అన్ని ఆశలనూ అడియాశలుగా మార్చుకొని, యీ ప్రపంచం ఒక మిథ్య. ఇందులో దుఃఖపడేవాళ్ళు ఎక్కువ. సుఖపడేవాళ్లు తక్కువ. ఆ సుఖపడేవాళ్లుకూడా వాస్తవమైన సుఖాన్ని పొందటం లేదు. తాము సుఖపడుతున్నామని భ్రమపడుతూ తమ్ము తాము వంచనచేసుకుంటున్నారు. అని లోకానికి చాటే యోగినిలా ఆమె మాట్లాడడం అతనికి బాధాకరంగా ఉంది. చేయి పోయిన తర్వాత ఆమెలో ముఖ్యంగా కలిగిన యీ మార్పు అతనికి ఆమె భవిష్యత్తుమీద ఆనందానికి హామీని కలిగించలేకపోతూందని వేరే చెప్పనక్కర్లేదు.

"రాజేశ్వరీ! నీలో మార్పు వస్తూంది."

"ఏం మార్పు" అన్నట్టు అతని వంక చూసింది.

"ఆ మార్పేమిటో నీకూ తెలిసే ఉంటుంది!"

"అవును"

అట్లా, మారడంలో నీ ఉద్దేశ్యం ఏమిటి ?

"జీవిత సత్యాన్ని, లక్ష్యాన్ని కనుక్కున్నాను. జీవితమంటే ఏమీ లేదు! తామరాకుమీది మంచు బిందువు జారినట్లే – అటువంటి జీవితం కోసం మనం ఇంత జాగ్రత్త వహించడం దేనికి ? అనిత్యములైన వస్తువుల కోసం ఇంత ఆదుర్దా పడటం దేనికి ? అశాశ్వతములైన హృదయాల కోసం ఇంత మమకారాన్ని పెంచుకోవటం దేనికి ?

దయానిధి భార్య ముఖంవంకే నిశ్చేష్టుడై చూస్తూవుండిపోయాడు. భర్తచూపులోని నిశ్చేష్టతయొక్క తీవ్రాన్ని భరించలేక ఆమె అక్కణ్ణుంచి మరో గదిలోకి వెళ్ళింది.

ఆ రాత్రి రాజేశ్వరి చాలాసేపటివరకు నిద్రపోలేదు. పోకపోవటం కాదు. నిద్రపట్టలేదు. మోహన్‌రావుగారి భార్యకు మశూచికం పోయి

టానికీ తన మనస్సుకూ ఏమైనా సూదంటురాయి సంబంధం ఉందేమోనని ఆమె చాల లోతుగా ఆలోచించింది. ఆమెకు మశూచికం ఎందుకు పోసింది? తను కారణమా? ఛీ! తనెందుకు కారణ మవుతుంది? ఒక వ్యక్తికి రోగం రావటానికి, అందులో మహామారి ప్రసాదితమైన మాయదారి రోగం మశూచికం లాంటిది రావటానికి మరొక వ్యక్తి ఎందుకు కారణం అవుతుంది? ఆమెకు అటువంటి రోగం రావాలని తను ఎన్నడైనా అజ్ఞాతంగా కోరుకుందా? ఛీ. తనకేం పని? తను అంత నీచురాలా? తన హృదయం అంత పాషాణమా? తనలో మానవత్వమనేదే లేదా? తను ఎన్నడూ అట్లా కోరుకుని వుండదు. ఒక వ్యక్తికి రోగం రావటం ఎవరి బాధ్యతా ఎవరి హేతువూ కాదు. ఆ వ్యక్తియొక్క ఆరోగ్య అనారోగ్యాల యొక్క తారతమ్యమే, కర్మాకర్మల పరిపాకమే అందుకు కారణం. ఒక వేళ చెడును మనస్సులో కోరినా అది సంభవించాలని ఎక్కడ రాసి పెట్టివుంది? తన కోర్కెకు అంత బలవత్తరమైన ప్రభావం వుందా? తను ఫలానా వ్యక్తి కావాలని కోరుకుంటే అలా జరుగుతుందా? తను లక్ష రూపాయలు అకస్మాత్తుగా ఏ లాటరీలోనో రావాలని కోరుకుంటే అట్లా వస్తాయా! ప్చ! మనుష్యుల కోర్కెలు – ఎప్పుడూ గాలిలో మేడలే! తను అనవసరంగా బాధపడటం కేవలం అవివేకమే! ఆమెకు మశూచికం రావటానికి కారణం ఆమె కర్మే! కర్మను తప్పించుకోలేం! పైగా ఒకళ్ళ కర్మకు ఒకళ్లు ఎప్పుడూ బాధ్యులు కారు? పూర్వజన్మలో చేసిన పాపాల ఫలితాలే కర్మల ప్రభావాలు. ఆ లలితకు... మోహనరావుగారి భార్యకు మశూచికం రావటం – పూర్వజన్మలో చేసుకున్న పాప ఫలితమే!

... మశూచికం ఎంత దారుణమైన రోగం! మనిషి ఎంత భయంకరంగా వికృతంగా మారతాడు! వొళ్లంతా తూట్లుపడతాయి. ముఖం చెదలు తిన్నట్లుగా .. లలితకూ అంతేనా? పాపం ... ఆమె అందం, ఆమె ముఖం తీరూ, పెదాల పేశలత్వమూ చుబుకపు పోరూ, కంఠపు గుండ్రదనమూ, నయనాల వొంపూ, అన్నిచోట్లా గుంటలు పడతాయి. ఆమెయొక్క సాయంత్రపు సూర్యకాంతి వంటి బంగారు శరీరం నల్లని మేఘంలాగ కాపురేసుకుపోతుంది. ఆమె వంక లోకం అసహ్యంగా

చూస్తుంది. ఆమె అందాన్ని చూసి హేళనగా నవ్వుతుంది. బజారువంక చూడటానికి ఆమె భయపడుతుంది. సిగ్గుపడుతుంది. దుఃఖపడుతుంది. పూర్వపు అందాన్ని చూసి – పాపం ఆమె ప్రతిక్షణమూ కునిక్ క్రుంగిపోతుంది. అందమైన స్త్రీలను చూసి మరీ బాధ పడుతూంది. మామూలు బాధకంటే అసూయతో కూడుకున్న బాధను భరించటం ఎంత కష్టం ?

– కాని ఆమె ఎన్నడైనా సౌందర్యవతిగా ఇంత క్రిందికి దిగజారుతుందని అనుకొనిఉంటుందా ? తను మటుకు ఎన్నడైనా అటువంటి దుర్ఘటన జీవితంలో సంభవిస్తుందని కలలోనైనా తలచిందా ? లేదు. అయినా సంభవించింది. ఆమెకూ అంతే ! ఆమెలో గర్వం పోతుంది. ఇంకా తనను చూసి నవ్వుతుందా ! ఊహూ ! ఇక నవ్వవలసిన తరుణం తనకు వచ్చింది. 'మిడిసిపాటు అణిగిందా ? చూడు ! నీ అందం ఏమైంది ? నీ ముఖంలో ఆ చెదలు ఏమిటి ? నీ ముక్కు వంకరగా ఉందేం ? నీ గడ్డం కింద ఆ పెద్ద మచ్చేమిటి ? నీ కనుబొమల చుట్టూ ఆ నలుపు ఏమిటి ?' అని తను ఆమె ముఖం మీద అనాలి ! అప్పుడు గానీ తనకు తృప్తి కలగదు.

ఆ ఆలోచనలతోనే రాజేశ్వరి పన్నెండూ యాభైఎనిమిది నిమిషములకు హాయిగా నిద్రపోయేందుకు యత్నించింది. కొద్ది నిమిషాల్లోనే ఆ ప్రయత్నమూ ఫలించింది.

నిద్రలో ఆమెకు ఒక కల వచ్చింది.

కలలో లలిత యొక్క మసూచికపు ముఖం వికటాట్టహాసం చేసింది.

ఆ వికటాట్టహాసానికి రాజేశ్వరి దడుసుకుంది.

ఆ దడుపుతో – మరుక్షణానికే మంటలు మండుతో మాయదారి జ్వరం వచ్చింది.

ఆ మాయదారి జ్వరంలో – ఆమెకు మశూచికం పొడసూపింది.

ఆ మశూచికంతో ఆమెను కూడా హాస్పిటలుకు చేర్చారు. లలిత ఎదురైంది. ఎదురై నవ్వింది. ఆమె కన్నీళ్లు కార్చింది. 'ఇంతే జీవితం – మనస్సుల్లో కల్మషం ఉన్నంత కాలమూ మానవులు ఇట్లానే తలక్రిందు

లవుతారు !' అన్నది లలిత. రాజేశ్వరి వినిపించుకోలేదు. చుట్టుప్రక్కల ఉన్న నర్సులు విని నవ్వలేదు.

రాజేశ్వరికి మశూచికం ఘోరంగా పోసింది.

భారమైన ఆ మశూచికపు వ్యాధిలో శరీరమంతా భయంకరంగా తూట్లతో వికృతంగా తయారుకావటమే కాకుండా – ఒక కన్ను గుడ్డిదైంది. ఇంటికి చేరింది. భర్త భయపడి ఇంటినుంచి పారిపోయాడు. లలిత ఆమె ముఖాన్నే ఆకాశం ప్రతిధ్వనించేట్టు నవ్వుతూ అన్నది: 'మిడిసిపాటు అణిగిందా ? చూడు నీ అందం ఏమైంది ? నన్ను హేళన చేశావే ? నీ ముఖంలో ఆ చెదలు ఏమిటి ? ఒక కన్ను గుడ్డిదయ్యిందే ! ఒక చెయ్యి కుంటిదేమిటి ? నీ గడ్డం క్రింద ఆ పెద్ద మచ్చ ఏమిటి ? నీ కనుబొమల చుట్టూ ఆ నలుపు ఏమిటి ?'

రాజేశ్వరి అద్దంలో ముఖం చూసుకొని కెవ్వున కేక వేసింది.

కల తెగిపోయింది. – రాతికి కొట్టుకున్న అలలాగ.

భయంతో మంచం మీద లేచి కూర్చుంది రాజేశ్వరి.

టేబుల్ మీద అలారం క్లాక్ మూడూ ముప్పైతొమ్మిది నిమిషాలు చూపుతోంది.

తెల్లవారుఝామున వచ్చే కలలు సామాన్యంగా నిజమవుతాయంటారు. తనకు వచ్చిన కల...? అమ్మో...

ఆ తరువాత రాజేశ్వరి నిద్రపోలేదు. భయపు పొగలు ఆమెను ఆవరించినై. ఆలోచనలు ఆమె గుండెను కట్టి పడవేసినై; ఆమె శరీరం వేడితో మండుతోంది.

ఆ ఉదయమే రాజేశ్వరికి మంటలు మండుతూ జ్వరం వచ్చింది.

* * *

పదిహేను రోజుల తరువాత గండం గడిచి పిండం బయటపడింది అన్నట్టు మోహనరావు భార్య లలిత నయమై ఇంటికి వచ్చింది. జట్కాలోంచి దిగుతూండగానే రాజేశ్వరి కిటికీలోంచి ఆమెను చూసింది.

చూసిన క్షణంలోనే ఆమె రూపం ఎట్లా మారిపోయిందీ గ్రహించింది ఆమెను గురించి ఊహించిన దానికీ జరిగిన మార్పునకూ ఏం భేదం అగపడలేదు. ముఖం చెదలు తిన్నట్టుగానే అయింది. శరీరమంతా పొగతో నల్లబడిన చూరులాగా నల్లగానే అయింది. మనిషి కూడా సన్నబడింది. ఆమెను చూశాక రాజేశ్వరి ఆశ్చర్యపడిందిలేదు, కనీసం జాలి కూడా కలగలేదు. పై పెచ్చు ఆమెలో ఒక రకమైన ఆనందం కలిగిందని కూడా చెప్పవచ్చు. ఎందుకంటె ఆ పేటలో లలిత అందాన్ని గురించి ఇప్పుడు చెప్పకొనే వాళ్లు ఉండరు. స్త్రీ సౌందర్యాన్ని గురించి ప్రసక్తి వచ్చినప్పుడు – ఆమెను ఉదహరించాల్సిన అగత్యం పోతుంది.

పది గంటలకు ఎదిరింటి కృష్ణవేణమ్మ పలకరించి పోదామన్నట్టుగా లలిత ఇంటికి వెళ్లింది. ఆ వెళ్ళడం రాజేశ్వరి చూసింది. తను వెళ్ళి మాటాడించి రావటం ఆమెకు వ్యక్తిగత ధర్మంగా తోచింది. ఆ మధ్యాహ్నమే లలిత ఇంటికి పాదం మోపింది.

రాజేశ్వరిని ద్వారంలోనే చూసి –

"రండి" అని ఆహ్వానించింది లలిత. కూర్చునేందుకు కుర్చీ కూడా చూపించింది.

"ఒంటో కులాసాయేనా?" అన్నది రాజేశ్వరి.

"అవునండీ!"

"మాయదారి జబ్బు ముంచుకొచ్చినట్లు వచ్చింది. పాపం! మీ రూపూ, అందమూ, చందమూ – అంతా మారిపోయింది!" అన్నది రాజేశ్వర బరువుగా సానుభూతి తెలుపుతున్నట్టు.

ఆమెను చూడటానికి వచ్చిన వారంతా ఆమాటే అంటున్నారు గాని — నిజంగా వాళ్ళెవరూ రాజేశ్వరి పొందిన తృప్తిని పొందిఉండరు. కాని లలితకు ఆ తారతమ్య మేమీ గోచరించలేదు. రాజేశ్వరికి ఒకందుకు విపరీతమైన ఆశ్చర్యం వేసింది. తను అట్లా సానుభూతి తెలుపుతూంటే లలిత – జరిగిన దురదృష్టానికి బాధపడుతూన్నట్టు సూచాయగానైనా ముఖంమీద భావాన్ని వ్యక్తీకరించలేదు. తనకు చేయివిరిగినప్పుడు చూడ

టానికి వచ్చిన జనం విచారంగా పలికినప్పుడల్లా కన్నీటిముద్ద అయ్యేది. మరి లలిత అట్లా కాదేం? ఆమె మనోబలం, మనస్థైర్యం అర్థం కాలేదు రాజేశ్వరికి.

"పూర్వజన్మలో ఏ విధంగానో పాపం చేసిఉండకపోతే ఇట్లాంటి ఆకస్మిక దురదృష్టాలు మానవులకు పట్టవు. నా గతీ అట్లాగే అయింది. ఆ రోజు సాయంత్రం రెండు నిమిషాలపాటు ఆ సిల్కు ఎంపోరియంలో కాలం గడిపినట్టయితే నాకు ఈ దుర్గతి పట్టి ఉండేది కాదు."

"వదినగారూ! మనం జరిగిన తరువాత ఎన్నిసార్లు బాధపడితే మట్టుకు ఏం లాభం? మన కర్మయొక్క ఫలితాన్ని అనుభవించవలసిన వాళ్ళం మనమే గదా!"

"బాగా చెప్పారు. ఏది ఎప్పుడు జరుగుతుందో మనకు తెలియదు ఇవాళ లక్షాధికారి రేపు భిక్షాధికారి కావచ్చు. ఇప్పుడు నిర్మలంగాఉన్న ఆకాశమంతా మరికొంత సేపటికి మేఘావృతమై లోకాన్నంతా చీకటిలో ముంచవచ్చు. ఒక క్షణంలో విచ్చుకున్న పువ్వులాగా కళకళలాడే ముఖం – మరో క్షణంలో విచారంతో ముడుచుకున్న పువ్వులాగ నల్లబడొచ్చు. క్షణం ముందు భవిష్యత్తునుగూడా గుర్తించలేని జీవితాలు మనవి. కనుక ఉన్న కాస్త జీవితంలోనూ మనస్సులోనికి అహంకారమూ, అసూయా, ద్వేషమూ, చెడుగూ రానివ్వకుండా బ్రతకటం మంచిది. చూశారూ! కొందమందికి కొందమందినిచూస్తే హేళన, అసహ్యం. ఈ హేళన అసహ్యం – అనేవి మానవునిలో, ముఖ్యంగా హెచ్చుతగ్గుల తారతమ్యాన్ని బట్టే రూపు రేఖల ఎక్కువ తక్కువల భేదాన్నిబట్టే కలుగుతూంటవి. ఈ ధనమూ, పేదరికమూ, అందమూ, అందం లేకపోవటమూ, లావణ్యమూ, తారతమ్యాలూ శాశ్వతంకావని తెలుసుకొన్న వాళ్లు హేళన చెయ్యరు, అసహ్యించుకోరు."

ఆమె సంభాషణ వెనుక దాగిఉన్న ముఖ్యాశయం అర్థంకాక పోయినప్పటికీ లలిత శ్రద్ధగా ఆలకిస్తున్నట్లు తల ఆడించింది.

మధ్యాహ్నం అటువాలగానే రాజేశ్వరి తన యింటికి వెళ్ళింది.

నెలవంక నాటి చంద్రుడు రోజులు గడిచిన కొద్దీ వృద్ధియై పూర్ణచంద్రుడు అయినట్లు – క్రమేపీ రాజేశ్వరీ, లలితల మధ్య స్నేహంకూడా అభివృద్ధి కా సాగింది. కాని వాళ్ళ స్నేహానికి ఇంకా గమ్యం ఏర్పడలేదు. ఒక మాసం గడచేటప్పటికి వారి ఇద్దరిమధ్య స్నేహం గాఢమైంది. సామాన్యంగా ఇద్దరి వ్యక్తులమధ్య స్నేహం గాఢంగా పెంపొందటానికి కారణం . ఆ ఇద్దరి ఆత్మల్లో సాదృశ్యమైన సామరస్యం, అభిలాష హత్తుకుపోయే భావాలు, అద్దంలాంటి రూపాలు ఉండటమే. లలిత తనకంటె అందకత్తె కాదు అని ఎప్పుడు రాజేశ్వరి అభిప్రాయ పడిందో అప్పటి నుంచీ ఆమెతో స్నేహం చేయాలనే కాంక్ష ఆమెలో కలిగింది. ఆమెతో స్నేహం చేయడంవల్ల హృదయానికి తృప్తి చేకూరగలదనికూడా ఆమె విశ్వసించటం జరిగింది. లలితను ఆ ఇంటినుంచి వెళ్ళగొట్టాలనే ఆలోచన మళ్ళీ ఆమెలో' రాలేదు. దానికి అవసరమూ, కారణమూకూడా కనపడలేదు. ఎందుకంటే, లలిత అందానికి అసూయపడాల్సిన అవసరం రాజేశ్వరికి లేదు. ఇద్దరికీ అందంలో లోపాలు ఉన్నాయి. లలితకు ఒక కన్ను గుడ్డి, రాజేశ్వరికి ఒక చేయి కుంటి. ఒకళ్ళకు ఒకళ్లు సానుభూతి చూపుకోవలసిన వాతావరణమే ఇద్దరిమధ్య ఏర్పడ్డది. కానీ, ఒకళ్ళ అందానికి ఒకళ్లు పోటీ పెట్టుకోవాల్సిన అగత్యం లేదు. ఒకప్పుడు వాళ్లు ఇద్దరూ 'తమ అందం చూడండి' అని లోకం ముందు నిలబడినవాళ్ళే. కాని విధి పగదీర్చుకోవడంచేత ఇద్దరూ అంద విహీనులైనారు. అందమైన వాళ్ళను చూస్తే వాళ్ళ హృదయాలు ముడుచుకపోతాయి; వాళ్ల నేత్రాలు పసిమి రంగును ధరిస్తాయి. మూతులు వంకర్లు పోతాయి; చీదరింపులు చెలరేగుతాయి; ఏవగింపులు నాట్యం చేస్తాయి. వాళ్ళకు అందమైనవాళ్ళంటే అసూయ. అందమైన లోకమంటే అసూయ. అందమైన లోకమంటే ద్వేషం. అందాన్ని ఆరాధించే సంఘం మీద కత్తి కడతారు. ఈ ప్రపంచంలో ఏదీ శాశ్వతం కాదు. ముఖ్యంగా స్త్రీ అందం. అశాశ్వతమైన ఆ అందానికి మిడిసిపాటు తగదు.' ఈ విధంగా వాళ్లు నలుగురి ఎదుటా కంఠం విప్పి చాటుతారు. తెల్లని మల్లెపువ్వులను చూస్తే వాళ్లకు ఎందుకో కళ్ళలో కెంపు రంగు., – ఆవిడలో నాట్యమాడుతూ స్త్రీయొక్క సౌందర్యాన్ని పెంపొందిస్తాయి కాబోలు! కళ్ళజోళ్ళ ముఖాలుచూస్తే

వాళ్ళకు వోళ్లు మండుతుంది. అవి కళ్ళమీద విలాసంగా వాలి స్త్రీ యొక్క హోదాను పెంచుతాయి కాబోలు! మెడలో నెక్‌లెస్ పెట్టుకొన్న వాళ్ళను చూస్తే వాళ్ళు ముఖం మాడ్చుకుంటారు. అది స్త్రీయొక్క కల్పిత అందాన్ని అభివృద్ధి పరుస్తుంది కాబోలు! సిల్కుచీరలు ధరించిన వాళ్ళను చేతికి రిస్టువాచీలు పెట్టుకొన్న వాళ్ళను, వంకరగానడిచే వాళ్లనూ, కళ్ళు తిప్పేవాళ్ళనూ, పెదాలు కదల్చేవాళ్ళనూ, రెప్పలు వాల్చే వాళ్ళనూ, ఎప్పుడూ నవ్వేవాళ్లనూ – చూస్తే వాళ్ళకు శరీరం మీద తేళ్ళూ జెర్రులూ ప్రాకుతాయి. కాని అటువంటివాళ్ళను నిత్యమూ చూస్తూనే ఉంటారు. కిటికీ ప్రక్కన కూర్చుని, చూడకపోతే తోచదు.

కాని ఆ హృదయాల్లోనూ సానుభూతీ, జాలీ, దయా, అన్నీ ఉన్నాయి. తమకంటె అంద విహీనమైన వాళ్ళ పొత్తునే వాళ్ళు కాంక్షిస్తారు. వాళ్ళతోనే అధికంగా స్నేహం చేసేందుకు ప్రయత్నిస్తారు. తమ స్వకీయ సిద్ధాంతాలనూ, వ్యక్తిగత ధర్మాలనూ, సమాజం ముందు పెట్ట టానికి ఉద్యుక్తు లవుతారు.

ఆ పేటలో క్రమేపీ వాళ్ళ సాంగత్యాన్ని అభిలషించి వాళ్ల మాటలను వినేందుకు ఓర్పును పెంచుకొన్న ఆడవాళ్ళు కొంతమంది రోజూ మధ్యాహ్నం అక్కడకు చేరుతూ వుంటారు. అందులో నల్లమ్మా, సీతారామమ్మా, సత్యవతీ, నీరజాక్షమ్మ ముఖ్యులు. నల్లమ్మ తన నలుపునకు తనే సాటి. పుట్టినప్పుడే ఆ పేరుకూ, ఆరూపుకూ సార్థకత ఏర్పడిందని అందరూ అనుకున్నారు. ఇప్పుడు ఇన్నేళ్ళ తరువాత ఆమాట ఎవరైనా అంటే – నల్లమ్మ రాకాసిలాగ అన్నవాళ్ళమీద పడుతుంది.. సీతారామమ్మకు పుట్టెడు చెముడు. పెదాలు కదల్చేవాళ్ళను చూస్తే ఆవిడకు వొళ్లు తెలీని కోపం. పాపం! తనకు చెముడు లేదని నిరూపించటానికి తరచూ ఆమె చేసే పనులు కడుపు పగిలేంత నవ్వును పుట్టిస్తాయి. ఇక సత్యవతి సంగతి! పేరు పెట్టుకొన్నందుకైనా ఆమెఎన్నడూ సత్యం మాట్లాడి ఎరగదు. ఆ మాటకువస్తే ఆమె నిజంచెప్పనక్కర్లేదని ఆమె ఒప్పుకుంటుంది. పోతే నీరజాక్షమ్మ గోగుపుల్లలాంటి మనిషి. అందుకు తగ్గట్టు సర్వేబాదులాగా పొడుగు. రెండే ఆమె లోపాలు. అందుకేపాపం ఆమె ఆ కూటంలో

చేరవలసి వచ్చింది. వాళ్ళందరికీ రాజేశ్వరి నాయకురాలు. నాయకురాలి మాటలకు వాళ్లు తల యొగ్గ వలసిందే! నిత్యమూ మధ్యాహ్నంపూట రాజేశ్వరి ఇంటిలో చర్చలు జరుగుతూవుంటాయి. ఈ చర్చలు సామాన్యంగా ఆ పేటలో ఆ పూటక్రితం జరిగిన వింత సంఘటనల మీదా, వింత వింత మనస్తత్వాల మీదా, అందమైన వస్తువులమీదా, అందమైన ఆడ వాళ్ళమీదా జరుగు తూంటాయి.

ఆ మధ్య వారం పదిరోజుల్నుంచీ లలితలో అగపడుతూన్న మార్పును రాజేశ్వరి గమనిస్తూంది. లలితలో ఉత్సాహంలేదు. ఎప్పుడూ దేనిమీదో ధ్యానం పెట్టుకున్నట్లు, ఏదో అనుమానంతో మదనపడుతూన్నట్లు ఎవరో తనకు అపచారం తలపెట్టిచేస్తూన్నట్టు బాధపడ జొచ్చింది. రాజేశ్వరి ఇంటికి రావడం తగ్గించింది. కిటికీ లోంచి ఎప్పుడూ ఎవరికోసమో ఎదురు చూస్తున్నట్టు ఎదురుచూస్తూ వుంటుంది.

ఈ మార్పును అందరికంటె ముందు రాజేశ్వరి గుర్తించింది. సందేహ నివృత్తి చేసుకొన్నదాకా ఆమెకు మనస్సు నిలఃవలేదు. ఒకరోజు సాయంత్రం పనిపెట్టుకు వెళ్ళి అడిగింది.

"లలితా ... మనిషివి అంత నీరసంగా ఉంటున్నావెందుకు ?"

"నేనా ? ఏం నీరసం ? బాగానే ఉంటున్నాను."

"అబద్ధ మాడుతున్నావు."

"లేదు."

"నువ్వు లేదంటే లేకుండా ఎట్లా పోతుంది? ఒక్కొక్కప్పుడు మనం రహస్యాల్ని కడుపులో ఎంత పదిలంగా దాచుకున్నా-మన ముఖాలు అప్రయత్నంగానే దాగిఉన్న రహస్యాలను బయటకి చెబుతాయి. అలాగే నీ కళావిహీనమైన ముఖం – నువ్వు ఏదో ఒక విషయాన్ని గురించి బాధ పడుతూన్నట్టు చెప్పక చెబుతూంది."

"ఎందుకో రాజేశ్వరీ! మనం ఎప్పుడూతలవని విషయాలుకూడా, మనం అసాధారణం, అసంభవం – అని తలచిన విషయాలు కూడా మన జీవితాల్లో ప్రవేశిస్తూంటాయి."

"అందులో అసహజం ఏముంది? నాకు చేయి విరగడమూ, నీకు మశూచికం పోయటమూ ఆ జాతికి చెందినవేగదా! ఇప్పుడు ఏం జరిగింది?"

"ఏమైనా జరుగుతుంది మన రాత బాగుండక పోతే! జీవితాని కంతటికీ ముఖ్యమూ, ఆధారమూ అని నమ్మినప్పటికీ – మనం మోసపోతూంటాం. ఆడదాని బ్రతుకు అంత నిర్జీవమైంది. ఆధార రహితమైంది. సంసార చక్రంలో ఏ వంపు వచ్చినా ముందు ఆ ప్రభావం స్త్రీ జీవితం మీదే ప్రతిఫలిస్తుంది."

"ఏం చేస్తాం! ఆ తప్పు మనల్ని అట్లా తయారుచేసిన సంఘానిది. వస్తుతహా మనం సజీవులమే, మనలోనూ ప్రపంచగతిని మార్చే శక్తి సామర్థ్యాలు ఉన్నాయి. కాని అవి మగవాడి సమక్షంలోనే పరిపూర్ణతను పొందవలసిన దుర్గతి మనకు ఉంది. స్వతంత్రించి మనంచేసే ఘనకార్యాలు ఈ ప్రపంచంలో ఏమున్నాయి?"

"భర్తనుసరిదిద్దుకునేపాటి ఘనకార్యమైనా మనకు చేసేశక్తిలేదా?"

రాజేశ్వరి లలిత పరిస్థితిని సులభంగా గ్రహించింది. ఆమెను భర్త సరిగా చూడటంలేదు. అంటే సరిగ్గా ఇంటికి రావడంలేదు. ఆ విషయమే ఆమెను గాఢంగా కలవరపెడుతూవుండొచ్చు. రాజేశ్వరి మౌనం లలితలో సంచలనాన్ని కలిగించింది. ఆమె ముఖంలోకి పరీక్షగా చూసింది. లలితకు జవాబు చెప్పటానికి ఆమెకు కొంత వ్యవధి కావాల్సి రావటంవల్ల వెంటనే జవాబు చెప్పడం జరగలేదు.

"ఎందుకులేదూ! అది మనకు ధర్మం. ఈ కాలంలో అదే మన జీవిత లక్ష్యం కూడా కావడంలో వింతలేదు. భర్తయొక్క అవినీతినీ, భార్యచేసే ద్రోహాన్నీ, అన్యాయాన్నీ – ఖండించవలసిందే! భర్త తప్పుడు మార్గంలోంచి సక్రమమార్గంలోకి మళ్ళించవలసిన బాధ్యతకూడా భార్యమీదే ఆధారపడి ఉంది. పురాణాల్లో, చరిత్రల్లో అట్లా భర్తను మంచి మార్గానికి మళ్ళించుకున్న పతివ్రతల కథలు మనకు మైలురాళ్ళుగా, నిదర్శనాలుగా నిలిచి ఉన్నాయి. మీ ఆయన పరిస్థితి ఏమిటి? నిన్ను 'భార్య'గా చూడటం లేదా?"

“అవును. నాకు మశూచికం పోసిన దగ్గర్నుంచీ వారిలో చాలా మార్పు వచ్చింది. అంతకు ముందు నాతో వారు ఎంత ప్రేమగా, అన్యోన్యంగా, విడువకుండా ఉండేవారు! ఆ ప్రేమంతా ఏమైంది? వాన కురిస్తేనే కాని అసలు రంగు బయటపడనట్లు జీవితంలో ఏదో పరీక్షకు నిల్చే సంఘటన జరిగితే కాని వాస్తవమైన ప్రేమ బయట పడదేమో! మావారి పరిస్థితి గమనించాక నాకు అట్లానే అనిపిస్తోంది రాజేశ్వరీ! నా చీర కొంగు పట్టుకోవటంచేతనే వారు తన్మయతను పొందిన క్షణాలు కూడా ఉన్నాయి. నా ముఖంవంక చూస్తూ అనిర్వచనీయమైన ఆనందాన్ని పొందిన రాత్రులు కూడా ఉన్నాయి అటువంటివారు, ‘లలితా! నువ్వే నా జీవితేశ్వరివి! అర్ధాంగివి! నువ్వే నేను, నేనే నువ్వు! మన దాంపత్యం పూర్వజన్మ సుకృత సాఫల్యం! ఈ తరానికి ఆదర్శం!’ అని నన్ను మాటిమాటికీ ఆకాశానికి ఎత్తివేసేవారు, ఒక శాంతి కిరణంగా, వెన్నెల వెలుగుగా, విచ్చుచున్న పువ్వుగా, కోమల రేఖగా నన్ను భావించినవారు – నాటి అందం క్షీణించగా సామాన్య యువతి కంటే హీనంగా చూడ నారంభించారు. ఉపయోగం తీరిపోయినతరువాత అవతల పారవేసే వస్తువులాగా నన్ను అవతలకు నెట్టివేశారు. ఇదేం న్యాయం చెప్పు రాజేశ్వరి! ఈ అధికారం ఆయనకు ఎవరు యిచ్చారు? ఈ అహంకారం ఆయనలో ఎట్లా కలిగింది? జీవితంలో సమభాగం పంచుకున్న స్త్రీకి చేయవలసిన న్యాయమేనా ఇది! తల్లీ – తండ్రీ, అక్కా – చెల్లెలూ, అన్నా – దమ్ముడూ, బంధువులూ, స్నేహితులూ – అందర్నీ విడిచిపెట్టి సర్వస్వాన్నీ కంఠంలో తాళి గట్టినందుకు అర్పించి, భవిష్యత్తులో జీవితానికి గల హామీని విశ్వసించి, ఇంతదూరమూ వస్తే, ఆయనగారు చేసే ఈ దుర్మార్గాన్ని ఎట్లా సహించగలను రాజేశ్వరీ! ఆయనగారి మనస్సును మార్చలేనా? ఆయనగారు తెలుసుకోలేరా? భార్యయొక్క అందమే ముఖ్యమా? ఆ అందం కోసమేనా ప్రేమించినట్లు నటించటం? ఆ అందం పోయిననాడు కఠినత్వాన్ని వహించటమేనా? స్త్రీ అందం శాశ్వతం కాదని తెలుసుకదా! ఏ రోగంచేతనో, ఏ సంఘటన వలనో అకస్మాత్తుగా స్త్రీ అందం తగ్గిపోతే – ఇక ఆ స్త్రీ భర్త ప్రేమకు, అభిమానానికీ, దయకు, ధనానికి దూరమై జీవితాంతమూ

త్రిశంకు నరకంలో బాధపడవలసిందేనా? భార్య మనస్సుయొక్క ప్రాము ఖ్యతా, హృదయం యొక్క నిర్మలతా, పాతివ్రత్యంయొక్క విలువ – ఇవేమీ అక్కర్లేదా? అటువంటి భర్తయొక్క నియంతృత్వాన్నీ, అన్యాయాన్నీ, అవినీతినీ, అధర్మాన్నీ అరికట్టేందుకు ఈ సంఘం ఉపయోగ పడదా? చెప్పు రాజేశ్వరీ చెప్పు! ముందు ముందు నా బ్రతుకు ఏంకావాలి? వారు నన్ను ఇంత నిర్లక్ష్యంగా చూస్తూంటే నేను ఎట్లా జీవించేది? రాత్రిళ్ళు వారి రాకకోసం ఎన్నిరోజులు, ఎన్ని గంటలు, ఎన్ని నిమిషాలు ఓర్పునూ, సహనాన్నీ, కన్నీటినీ వ్యర్థం చేయను? వారు చేసే పనుల నీచత్వాన్ని తలుచుకొని ఎంతకాలం గుండెలో దుఃఖాన్ని భరించను? చెప్పు రాజేశ్వరీ! నన్ను ఏం చేయమంటావు? ఈ సంఘంలో మహిళను నేను –"

లలితయొక్క వేదనాపూరితమైన వాక్యాలు వింటూంటే రాజేశ్వరికీ ఏదో హృదయంలో కెలుకుతూన్నట్టు అయింది. తన బ్రతుకుకూడా అట్లానే తెల్లవారుతుందేమో నన్న భయం ఆమెలో సన్నగా ప్రవేశించింది. ఆ భయాన్ని తాత్కాలికంగా పైకి కనబర్చనీయకుండా తొక్కిపెట్టి లలితకు ధైర్యాన్ని పురికొల్పేందుకు ప్రయత్నించింది.

"నువ్వు అలా అధైర్యపడబోకు లలితా! జీవితం మనం అనుకొన్నంత కంటకమూ, ఆనంద రహితమూ ఎన్నడూ కాదు. పరిస్థితుల్ని ఎదుర్కొనే మనోబలమూ, ధైర్యమూ, సాహసమూ మనలో ఉండాలేగాని – ఇంత కంటే తీవ్రములైన సమస్యలే పరిష్కరించవచ్చు. మీ వారు ఇంత హృదయం లేనివారని నేను ఎన్నడూ తలచియుండలేదు. ప్రయత్నిస్తే సక్రమ మార్గానికి రాకపోరు. మా వారితో కూడా చెప్పి చూస్తాను, మీ ఆయనకు తగిన సలహా ఇవ్వమని" అని లలితతో చెప్పి రాజేశ్వరి వెంటనే ఇంటికి వచ్చింది.

ఆమె కలత హృదయంతోనే ఇంటికి వచ్చింది. తన భర్తయొక్క నీతి – అవినీతుల్ని తను ఎన్నడూ ఆలోచించి ఎరుగదు. తన బ్రతుకు కూడా లలిత బ్రతుకులాగే అవుతుందేమో!... ఛీ తన భర్త అటువంటి వారు కాదు. తను ఈ విషయంలో లలిత కంటే అదృష్టవంతురాలే

తనకు చెయ్యి విరిగిన దగ్గర్నించి తనలో అందం తగ్గినా – తన భర్తకు తన మీద ఏం ప్రేమ తగ్గలేదు. పై పెచ్చు ప్రేమ అధికం కూడా అయిందేమో! తనను ఏ చిన్నపని కూడా చేయ నివ్వరు. తనను నిత్యమూ సంతోష పెట్టేందుకు ఏదో ఒక విధంగా ప్రయత్నిస్తూనే ఉంటారు. వారు సహృదయులు. వారికి తన మీద ఉన్న ప్రేమ అచంచలమైంది. ఎట్టి పరిస్థితుల్లోనూ, ఏ విధంగానూ మారనిది. తను అదృష్టవంతురాలు. తనను జీవితాంతమూ ఇంత ప్రేమగానూ, అభిమానంగానూ, జాగ్రత్త గానూ చూస్తారు.

సాయంత్రం మాసిపోయి చీకటి పడింది.

రాజేశ్వరి దయానిధి కోసం కిటికీ ప్రక్కన కూర్చుని ఎదురు చూస్తూనే ఉంది. ఆరున్నర, – ఏడుగంటలు, ఏడున్నర, – ఎనిమిది గంటలు క్రమంగా దాటి పోయినాయి.

ఇంకా దయానిధి ఇంటికి రాలేదు.

నిమిషం గడిచినదే రాజేశ్వరిలో ఆరాటం జాస్తి కాజొచ్చింది. వారు ఇవాళ ఇంకా ఎందుకు రాలేదు? రోజూ ఏడు గంటల లోపుగానే వచ్చే వారే! సినిమాకు వెళ్ళారేమో! సినిమాకు వెడితే తనతో చెప్పి వెళ్ళేవారేనే! మరి ఎక్కడకు వెళ్లివుంటారు? రోజూ ఏడు గంటలు లోపుగానే వచ్చేవారే! ఏం జరిగింది? వారి కేమైనా అపాయం జరిగిందేమో! ఇంటికి వస్తూంటే ఏదైనా కారు క్రింద ... అట్లా ఎన్నటికీ జరిగి ఉండదు. ఎవరైనా స్నేహితుని వెంట సినిమాకు వెళ్లి ఉంటారు. అంతే! ఆ కాస్త భాగ్యానికి తను ఇట్లా చెడును ఊహించుకొని, లేని పోని అనుమానాలను పెంచుకొని – బాధపడటం సబబు కాదు. వారు వస్తారు. ఇంకో పావు గంట, అరగంట, లేకపోతే పార్కులో కూర్చుని మిత్రులతో బాతాఖానీ వేస్తున్నారేమో!

ఎనిమిదిన్నర, తొమ్మిది – తొమ్మిదిన్నర కూడా దాటింది. ఇంకా రాజేశ్వరి ఆ కిటికీ ప్రక్క కూర్చుని భర్త రాకకై ఎదురు చూస్తూ ఉంది. బజారులో జనసంచారం చాలా పల్చబడింది. రోడ్డుమీద ఎలక్ట్రిక్ స్తంభం క్రింద ఒక కుక్క పడుకొని ఉంది. ఆ కుక్క ప్రక్కన ఒక బిచ్చగాడు

చల్లగాలికి ప్రాణాన్ని అంకితం చేశాడా అన్నట్టు ప్రగాఢంగా నిద్రపోతు న్నాడు. మర్రిచెట్టు క్రింద రెండు రిక్షాలు ఉన్నాయి. రిక్షా లాగేవాళ్లు మైమరచి నిద్రపోతున్నారు.

ఒకవేళ వారి ప్రకృతి మారిందేమో! వారి మనస్సులో కాక తాళీయంగా మార్పు ప్రవేశించిందేమో! ఏ స్త్రీ దగ్గరో . ఏ పందిరి మంచం మీదనో, పచ్చలైటు క్రిందనో . స్వర్గసుఖం తాలూకు సరిహద్దు లలో...అటువంటివారు కాదు. తను ఓ అనుమానపు మనిషి. తన అను మానాలకు ఆధారాలు లేవు. తన స్త్రీత్వం వారి సహృదయం యొక్క విశాలత్వాన్ని అంచనా వేయలేక పోతోంది. అటువంటి పాపపు పనికి వారు ఎన్నడూ పాల్పడరు. అట్లాంటి అవినీతికరమైన పని వారు ఎప్పుడూ చేయరు. వారికి భార్యమీద ఉన్న ప్రేమ, అభిమానం, మోహం, మమత, విశ్వాసం వారిలో ఎటువంటి నీతి దూరమైన మార్పును ప్రోత్సహించవు. వారికి భార్యే లోకం. భార్యే సర్వస్వం. భర్త జీవితానికి 'భార్య' అన్న పదం యొక్క వాస్తవమైన విలువకు వారు ఎన్నడూ అపచారం తలపెట్టి యెరుగరు. వారు తప్పకుండా సినిమాకే వెళ్లి ఉంటారు. తను ఇంకా అలజడి పడటం అవివేకమే!

పదీ, పదిన్నరా – పదకొండు గంటలు కూడా దాటేటప్పటికి రాజేశ్వరిలో విపరీతమైన అనుమానాలు చెలరేగినై. ఆలోచించుకొన్న కొలదీ ఆమె హృదయం విషాదంలో ఊగిసలాడింది. కళ్లల్లో దుఃఖం ఎదురు తన్నింది. దయానిధి ఇంకా రాలేదు. రాజేశ్వరి ఇంకా ఆ కిటికీ దగ్గరే ఉంది. ఈ లోపల తల్లి ఎన్నిసార్లు పిలిచినా – ఆమె కిటికీ దగ్గి ర్నుంచి కదలలేదు. ఎదురుచూస్తూనే ఉంది. ఒక వ్యక్తికోసం ఎదురు చూడటమంటే అది ఎటువంటి సున్నితమైన బాధకూ, అలజడికీ, కోపా నికీ, అనుమానాలకూ దారి తీస్తుందో చెప్పలేం. ఇక భార్య భర్త రాక కోసం ఎదురు చూసే విషయంలో – ఆలస్యం ఎక్కువగా జరిగితే సర్వ సామాన్యంగా అనుమానాలే ఎక్కువగా చెలరేగుతై. రాజేశ్వరి విష యంలో కూడా అట్లాగే జరిగింది. ఆమెలోనూ విపరీతంగా అనుమానాలు మొలకలెత్తాయి. 'భర్త సినిమాకు వెళ్లివుంటాడు' అని అనుకొని తృప్తి

పడేందుకు అవకాశం లేదు కనుక – ఏదో ఇంటికి రాలేని సంఘటనగానీ, ఇంటినీ, భార్యనూ మర్చిపోయేంత తన్మయతలో ఉండటం గానీ జరిగి ఉండొచ్చు. వారిని తన్మయతలో బంధించే స్త్రీ ఎవరు? ఈ విధంగా వారు ఎన్ని గంటలు, ఎన్నిరోజులు ? తను అనుమానపడవలసిందేగాని వారు అటువంటి మనస్తత్వం కలవారు కాదు. ఏమో! వారి బుద్ధి మారకూడదూ? మగవాళ్ళ బుద్ధులు మారకుండా ఉండేందుకు – ఏ సంఘమూ ఏ ప్రభుత్వమూ, ఏ న్యాయశాస్త్రమూ ఆంక్ష విధించ లేదుగా! వారి బుద్ధి మీద స్త్రీ ఎందుకు విశ్వాసాన్ని కోల్పోరాదు. లలిత భర్త మనస్సు మారలేదు! ఈ మగవాళ్ళ మనస్సులు వానాకాలాపు మేఘాలే! ఆనందం కోసం – ఎట్లాసైనా మారుతారు. 'ఆనందం' అనే ఒక వస్తువుచుట్టూ ప్రదక్షిణం చేస్తారు. భార్య, లోకం, నీతి, న్యాయం, ధర్మం, హక్కు – ఇవేమీ చూడరు. తన బ్రతుకుకూడ లలిత బ్రతుకు లాగ అవుతుందేమో! ఏమో ఎవరు చూశారు?

బజార్లో దూరంగా ఒక రిక్షా వస్తోన్నట్టు రాజేశ్వరి గుర్తించింది. రిక్షాలో వచ్చేది ... వారేనా? వారైతే ఎంత బాగుండును? రాజేశ్వరి హృదయం ఒకసారి ఆనందంతో గంతులేసింది. ఇంటిముందు రిక్షా ఆగింది. రాజేశ్వరి ఇంటి ముందుకు వెళ్ళింది. దయానిధి రిక్షాలోంచి దిగాడు. వీధి వైపు కాంతి అతని ముఖంమీద పడింది. అతని ముఖం చాల నీరసంగా ఉంది. అంతకంటె నీరసంగా అతను ఇంటిలోనికి నడిచాడు. మెట్లమీద తూలి పడబోయాడు.

"అదేమిటండీ! అట్లా ఉన్నారేం? రాజేశ్వరి గొంతు చించుకుంది.

దయానిధి మాట్లాడలేదు. సరిగ్గా మాట్లాడలేని స్థితిలో ఉన్నాడు. మండిగం దాటబోయి ముందుకు పడబోయాడు. రాజేశ్వరి వెనుకగా వచ్చి పట్టుకుంది. అతని శరీరాన్ని పట్టుకోగానే ఆమె చేతులకు సలసల కాగే నీళ్ళల్లో చేయి పెట్టినట్టుంది. జ్వరం మండి పోతోంది. రాజేశ్వరిని భయం ఆవహించింది. మంచంమీద జాగ్రత్తగా పడుకో బెట్టింది.

“వొంట్లో ఎలా ఉందండీ! ఇప్పటివరకూ ఎక్కడ ఉన్నారండీ! ఈ ప్రశ్నలు రాజేశ్వరి ఎన్ని సార్లు రెట్టించి అడిగినా దయానిధి సమాధానం చెప్పలేదు. ముఖం అటు త్రిప్పిపడుకున్నాడు.

“డాక్టర్ను పిలిపించేదా?”

దానికి కూడా దయానిధి సమాధానం చెప్పలేదు.

రాజేశ్వరికి ఏమీ తోచలేదు. డాక్టర్ను పనిమనిషి చేత పిలిపించింది. డాక్టరు ఇంజక్షను చేసి వెళ్లాడు. తెల్లవారితేగాని రోగనిర్ధారణ చేసి చెప్పలేనని అన్నాడు డాక్టర్.

కాని తెల్లవారకముందే దయానిధి చనిపోయాడు. చనిపోతూ చనిపోతూ భార్యతో ఏమీ చెప్పలేదు. కాని ఒక విషయం మట్టుకు వాస్తవం. అతను అట్టి స్థితిలో భార్య ముఖం చూసేందుకు సిగ్గుపడ్డాడు. భయపడ్డాడు దయానిధి. ఆకస్మిక మరణం ఆ పేటలోని అందర్నీ ఆశ్చర్యంలో ముంచింది.

అంతకంటె విపరీతమైన ఆశ్చర్యమైన సంగతేమిటంటే, భర్త ఆకస్మికంగా చనిపోయినా రాజేశ్వరి ఏడవ లేదు. ఆమె కళ్ళ వెంట రాలిన బరువైన నీటి బిందువుల్ని ఎవ్వరూ అప్పుడు చూడలేదు. కాని కొంత మంది విజ్ఞులు ఆమెలో వెల్లుబికి వచ్చే దుఃఖాన్ని గమనించినవాళ్ళు కూడా ఉన్నారు.

తనకు చెయ్యి విరిగిన దగ్గర్నుంచే రాజేశ్వరిలో – ఏదో ఒక సంఘటనవల్ల భర్త తన జీవితంపైన నల్లగుడ్డను కప్పుతాడు. వారు వాస్తవంగా తనను గాఢంగా ప్రేమిస్తున్నారా? లోకం దృష్టిలో ‘ఆదర్శవంతుడైన భర్త’ అనే ఖ్యాతి సంపాదించుకోనేందుకు ప్రేమిస్తున్నారా?’ అన్న అభిప్రాయం అజ్ఞాతంగా రూపొందుతూ వచ్చింది. కనుకనే ఆమె అట్లా మనస్సును ప్రతి విషయానికీ చెడగొట్టుకోవడం! తన విధి వక్రించడం చేత తనను ప్రేమించేవారు ప్రేమించకుండా పోతారని ఆమె ఎప్పట్నుంచి మనస్సులో అభిప్రాయపడుతూ వచ్చిందో – అప్పట్నుంచీ ఆమె తనకు తెలియకుండానే లోకాన్నీ సంఘాన్నీ రామణీయకతనూ ద్వేషిస్తూ తనకు

తానే చెడును కూడా తనకు తెలియకుండా ఆరాధించిందని కూడా చెప్పవచ్చు.

"క్షణం ముందు ఏం జరుగుతుందో తెలియదు గదా! నిన్న ఆఫీసుకు కూడా వెళ్ళారట. అంతలోనే ముంచుకు వచ్చింది ఆ రోగం. ఇంతకూ అతనికి ఈ భూమిమీద గింజలు లేవు. మనమూ, మనం చేసే పనులూ శాశ్వతమని అనుకుంటాము గానీ – మరికొన్ని క్షణాలకే ఈ లోకానికీ మనకూ ఋణం తీరిపోతుందని ఎప్పుడైనా అనుకుంటామా? మన జీవితాలు అంత నిత్యం లేనివి." అని కూడా చేరిన వాళ్ళల్లో ఒక అనుభవాన్ని జీర్ణించుకున్న ముసలావిడ అన్నది.

ఆ మాట రాజేశ్వరి విన్నది.

కాని ఆమె ఏడ్వటం లేదు.

ఆమె తల్లి గది ప్రతిధ్వనించేటట్లు ఏడుస్తున్నా, ఆమె కంటినుండి నీళ్లు రాలేదు. దీర్ఘమైన గంభీరత ఆవరించింది. అట్లా శూన్యంలోకి చూస్తూన్నట్టు చూస్తుంది.

(ఆంధ్ర ప్రభ)

—o—